JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 22-06-2026
Medchal - Malkajgiri | Monday 22-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 21
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 21 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me

jayabheripaper@gmail.com



## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా దగ్ధమైన ఎలక్ట్రిక్ బస్సు
- షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా
- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడ్డ 41 మంది ప్రయాణికులు

జయభేరి, కరీంనగర్ :

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.



## నీట్ రీఎగ్జామ్ విద్యార్థుల కోసం

- "ప్రధాని మోడీ" షాకింగ్ నిర్ణయం..!

జయభేరి, న్యూఢిల్లీ:

నీట్ యూజీ రీఎగ్జామ్ రాస్తున్న అభ్యర్థులకు ట్రాఫిక్ ఆంక్షల వల్ల ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలో తన ప్రయాణాన్ని కొంతసేపు వాయిదా వేసుకున్నారు. కోల్‌కతా పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత ఆయన వెంటనే లోక్ కల్యాణ్ మార్గ్‌లోని నివాసానికి వెళ్లలేదు. వర్గాల సమాచారం ప్రకారం, ప్రధాని మధ్యాహ్నం సుమారు 1.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే రోజు నీట్ రీఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండటంతో, పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థుల రాకపోకలకు ఆటంకం కలగకూడదని ఆయన విమానాశ్రయంలోనే వేచి ఉన్నారు. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో ట్రాఫిక్‌పై జాగ్రత్త ప్రధాని కదలికల సమయంలో సాధారణంగా భద్రతా ఏర్పాట్లలో భాగంగా కొన్ని మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణలు ఉంటాయి. పరీక్ష సమయం దగ్గరగా ఉన్నప్పుడు అలాంటి ఆంక్షలు విద్యార్థులపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో, పరీక్ష ప్రారంభమైన తర్వాతే నివాసానికి బయలుదేరాలని నిర్ణయించినట్లు వర్గాలు తెలిపాయి. నీట్ యూజీ 2026 రీఎగ్జామ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా వైద్య అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష కీలకం.

...మిగతాది 2 లో



## అన్నదాత సుఖీభవ నిధులు జమ

జయభేరి, విజయవాడ, జూన్ 21 :

ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ తో పాటుగానే అన్నాదాత సుఖీభవ పథకం కింద నిధులు జమ చేస్తోంది. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నిధులను తాజాగా రూ 5 వేలు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే, అర్హత ఉండీ నిధులు అందని రైతులకు వ్యవసాయ శాఖ కీలక సూచనలు అందించింది. ఏపీ ప్రభుత్వం తాజాగా అన్నాదాత సుఖీభవ నిధులను విడుదల చేసింది. పీఎం కిసాన్ పథకం నిధులను ప్రధాని నరేంద్ర మోదీ, అన్నదాత సుఖీభవ నిధులను సీఎం చంద్రబాబు వేర్వేరుగా విడుదల చేసిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు నగదు జమైంది. శనివారం సాయంత్రం 5గంటల సమయానికే పీఎం కిసాన్ నిధులు 100శాతం, అన్నదాత సుఖీభవ నిధులు 99.80శాతం రైతుల ఖాతాలకు చేరాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఇంకా జమకాని వారికి నాలుగైదు రోజుల్లో చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. కాగా, ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు కొందరు రైతులకు సాంకేతిక కారణాలతో జమ కాలేదనే సమాచారం అందుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉండీ.. నగదు జమ కాకుంటే.. రైతులు ఏం చేయాలో అధికారులు సూచిస్తున్నారు. నిధులు జమ కాకుంటే ఇలా చేయండి ఖాతాల్లో నిధులు రాని రైతులు ఎవరూ ఎలాంటి

...మిగతాది 2 లో

## ఢిల్లీకి వస్తున్నా.. మీదే బాధ్యత- రేవంత్



సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనకు సిద్ధమయ్యారు. మెట్రో ప్రాజెక్టు విషయంలో సీఎం రేవంత్ కొద్ది రోజులుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు. కిషన్ రెడ్డి లక్ష్యంగా విమర్శలు చేస్తున్న సీఎం.. నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఢిల్లీకి వెళ్లాలని డిసైడ్ అయిన రేవంత్.. తాజాగా కిషన్ రెడ్డికి లేఖ రాసారు. అందులో కీలక అంశాలను ప్రస్తావించారు. రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయించాలని కోరారు. కిషన్ రెడ్డి స్పందన ఇప్పుడు కీలకంగా మారుతోంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ సమయంలోనే కిషన్ రెడ్డి కి మరో లేఖ రాసారు.

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు సంబంధించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా జోక్యం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 16న రాసిన లేఖనూ తాజా లేఖలో ప్రస్తావించారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, ఈ సందర్భంగా రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యంఉందని లేఖలో సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ అంశాలు సత్వరం పరిష్కారం కావాలని లేఖలో పేర్కొన్నారు. మెట్రో ప్రాజెక్టు పై రేవంత్ కసరత్తు అశ్వినీ వైష్ణవ్‌కు మెట్రోకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరిస్తానని, చర్చలకు అవసరమైన.. సంబంధిత ఒప్పందాలు, ఇతర పత్రాల ప్రతులను

...మిగతాది 2 లో



## తెలంగాణ నుంచి రాజ్యసభకు మీనాక్షి..?

- క్లారిటీ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్
- మధ్య ప్రదేశ్ నుంచే రాజకీయాలు చేస్తానని ప్రకటన

జయభేరి, హైదరాబాద్ :

మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన నామినేషన్‌ను బీజేపీ, ఎన్నికల సంఘం లాలూచీపడి తిరస్కరించాయని, తన సీటును దొంగిలించారని ఆమె ఆరోపించారు. తనపై ఎలాంటి లీగల్ కేసులు లేవని.. అఫిడవిట్ సాకుతో కుట్ర పూరితంగా వ్యవహరించారని మండిపడ్డారు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తినని.. కాబట్టి అక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తానన్నారు. తెలంగాణ నుంచి ఎవరితోనూ రాజీనామా చేయించి సీటు తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి తాను దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో

...మిగతాది 2 లో



## అమెరికా-ఇరాన్ చర్చలు

- పెట్రోల్ ధరలు తగ్గుతాయా?

జయభేరి, న్యూఢిల్లీ:

అమెరికా, ఇరాన్ మధ్య అత్యంత కీలకమైన చర్చలు స్విట్జర్లాండ్‌లో ప్రారంభమయ్యాయి. అణు ఒప్పందం, వాణిజ్య వివాదాలకు శాశ్వత పరిష్కారం కనుగొనే లక్ష్యంతో ఈ సమ్మిట్ జరుగుతోంది. ఈ చర్చల్లో పురోగతి సాధించేందుకు దౌత్యవేత్తలు 60 రోజుల గడువును నిర్దేశించుకున్నారు. ఈ భేటీ సక్సెస్ అయితే రాబోయే కాలంలో ప్రపంచ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రమే మారిపోయే అవకాశం ఉంది. భారతదేశం విషయానికొస్తే, ఇంధన భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం కోసం ఈ సమావేశం చాలా కీలకం. ఇరాన్‌పై ఆంక్షలు సడలిస్తే, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ దిగుమతి బిల్లు తగ్గి, రూపాయి విలువ బలపడుతుంది. చమురు ధరలు తగ్గితే రవాణా ఖర్చులు తగ్గి, సామాన్య భారతీయులపై ద్రవ్యోల్బణం భారం కూడా తప్పుతుంది. అమెరికా-ఇరాన్ చర్చలు.. ఆయిల్ ధరలపై ప్రభావం రంగం ప్రభావం చమురు ధరలు తగ్గే అవకాశం ఉంది భారత రూపాయి బలపడే అవకాశం ఉంది విమానయానం ప్రయాణ సమయం తగ్గుతుంది గల్ఫ్ భద్రత మెరుగైన భద్రత లభిస్తుంది ప్రపంచ మార్కెట్లు ఈ దౌత్యపరమైన చర్చల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. క్రూడ్ ఆయిల్ సరఫరా పెరిగితే భారతీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల లాభాలు మెరుగుపడతాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ త్వరలోనే నిలకడగా మారుతుందని ఇన్వెస్టర్లు ఆశిస్తున్నారు. ముడి సరుకుల దిగుమతులపై ఆధారపడే వ్యాపారాలకు ఈ స్థిరత్వం ఎంతో మేలు చేస్తుంది. గల్ఫ్‌లో భారతీయుల భద్రత.. షిప్పింగ్ రంగం గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న వేలాది మంది భారతీయ నావికులకు ఈ శాంతి చర్చలు కొత్త ఆశలు కల్పిస్తున్నాయి. ఉద్రిక్తతలు తగ్గితే ఎర్ర సముద్రం, పర్షియన్ గల్ఫ్ మీదుగా

...మిగతాది 2 లో

## రేవంత్ రెడ్డి వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్
- జయశంకర్ సార్‌కు కేటీఆర్ నివాళులు
- రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్
- కాంగ్రెస్ భూదందాలపై తీవ్ర విమర్శలు




జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ అస్తిత్వ పోరాట ప్రతీక ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేళ, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని, తెరవెనుక మాఫియా శక్తులు చెలరేగిపోతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనుసన్నల్లోనే మంత్రులంతా చేతులు కలిపి రాష్ట్ర సంపదను యథేచ్ఛగా దోచుకుంటూ, దాచుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. సమకాలీన రాజకీయాన్ని సినిమా రంగుల ప్రపంచంతో పోలుస్తూ కేటీఆర్ వినూత్న విమర్శలు చేశారు. వెండితెరపై 'అర్జున్ రెడ్డి' ప్రభంజనం సృష్టిస్తే, ఇటు నిజజీవితంలో 'రేవంత్ రెడ్డి' అనే చిత్రం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని ఎద్దేవా చేశారు. ఈ పాలన అనే సినిమా మొదటి భాగం ముగిసేసరికే ప్రజలు విసిగిపోయారని, ఎప్పుడు ముగుస్తుందా

...మిగతాది 2 లో

## నీట్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్



- వాష్‌రూమ్‌లో మొబైల్ దాచిన విద్యార్థి
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఇన్విజిలేటర్లు
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ శివార్లలోని ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాగన్నగూడ జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో నీట్ 2026 పరీక్ష రాస్తూ మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 18 ఏళ్ల విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు పరీక్ష ప్రారంభానికి ముందే, అంటే ఉదయం 7 గంటలకే కేంద్రానికి చేరుకుని ఒక పక్కా ప్లాన్ అమలు చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఒక జిప్‌లాక్ కవర్‌లో పెట్టి, వాష్‌రూమ్‌లోని ఫ్లష్‌ట్యాంక్ వెనుక గల వెంటిలేటర్‌లో అత్యంత చాకచక్యంగా దాచిపెట్టాడు. ఆ తర్వాత కేంద్రం ఎంట్రీ వద్ద

...మిగతాది 2 లో

# స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్ శాంతి చర్చలు




ఈ ఒప్పందంలో 60 రోజుల్లోగా తుది అంగీకారానికి రావడం, లెబనాన్‌తో సహా సరిహద్దులలో శత్రుత్వాన్ని ముగించడం, హోర్ముజ్ జలసంధిని తెరవడం వంటి కీలక అంశాలు ఉన్నాయి. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు గల హిజ్బొల్లా మధ్య కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో శనివారం హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. అయినప్పటికీ, నౌకల ట్రాకింగ్ డేటా ప్రకారం, ఆ మార్గం గుండా ఓడల రాకపోకలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. చర్చలు ప్రారంభమైన కొద్దిసేపటి తర్వాత, అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ అకౌంట్‌లో ఒక పోస్ట్ చేశారు. "లెబనాన్‌లోని తన పెయిడ్ ప్రాక్సీలు (మద్దతు గల దళాల) అలజడులు సృష్టించకుండా ఇరాన్ తక్షణమే నిలువరించాలి" అని అందులో రాశారు.

ఒకవేళ అలా చేయకపోతే ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు. చర్చల ప్రారంభానికి ముందు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ, అణు కార్యక్రమం, లెబనాన్ అంశాలపై పురోగతి ఉంటుందని ఆశిస్తున్నామన్నారు. మరోవైపు, "అవతలి పక్షం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తాం" అని తెహ్రాన్ అంటోంది. స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో వాన్స్ మాట్లాడుతూ.. చర్చల ద్వారా ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని ప్రతినిధులను ట్రంప్ కోరినట్లు తెలిపారు.

ఇరాన్ నాయకత్వం ప్రాంతీయ అస్థిరతకు కారణం కాకుండా, అణ్వాయుధ ఆకాంక్షలను వదులుకోవడానికి సిద్ధపడితే, ఆ దేశంతో తమ సంబంధాలను మార్చుకోవడానికి అమెరికా సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే, తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుతమైనదంటూ ఇరాన్ మొదటి నుంచీ వాదిస్తోంది. తుది ఒప్పందం కోసం జరిగే చర్చలు, ప్రస్తుత హామీలను అమలు చేయడంపైనే (అన్ని సైనిక చర్యలను నిలిపివేయడంతో సహా) ఆధారపడి ఉంటాయని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నాటి చర్చలు ప్రధానంగా ఈ నిర్ణయాల అమలుపైనే ఉంటాయని చెప్పారు.

బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో జరుగుతున్న ఈ చర్చల్లో జేడీ వాన్స్‌తో పాటు డోనల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ కూడా పాల్గొన్నారు. ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శనివారం అర్ధరాత్రి స్విట్జర్లాండ్ చేరుకున్నారు. ఈ ప్రతినిధి బృందాలతో పాటు పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ కూడా చర్చల వేదికకు చేరుకున్నారు. ఈ యుద్ధంలో పాకిస్తాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. గతంలో అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన ఒక విడత చర్చలకు కూడా పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చింది.

**యుద్ధాన్ని తక్షణమే ముగించే లక్ష్యంతో ..**

యుద్ధాన్ని తక్షణమే ముగించే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ అధ్యక్షులు ఈ వారంలోనే ప్రాథమిక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇరాన్ 'పునర్నిర్మాణం' కోసం 300 బిలియన్ డాలర్ల ప్రణాళికతో పాటు, ఆ దేశంపై ఉన్న 'అన్ని రకాల ఆంక్షలను' అమెరికా రద్దు చేయడం కూడా ఇందులో ఉన్నాయి. కానీ, ఈ సంఘర్షణకు ప్రధాన కారణంగా అమెరికా పేర్కొన్న ఇరాన్ అణు కార్యక్రమం అంశంపై మాత్రం.. 60 రోజుల వ్యవధిలో ఇంకా చర్చలు జరగాల్సి ఉంది. ఈ గడువు ఇంకా పొడిగించే అవకాశం కూడా ఉంది. మరోవైపు, ఈ ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు గల హిజ్బొల్లా సాయుధ దళాల మధ్య ఘర్షణలు కొనసాగాయి. ఫిబ్రవరి 28న అమెరికాతో కలిసి ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధంతో హిజ్బొల్లాతో సాగుతున్న ఘర్షణకు సంబంధం లేదని, అది వేరని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఇరాన్ సుప్రీం లీడర్ మరణానికి కారణమైన దాడికి ప్రతీకారంగా హిజ్బొల్లా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగించడంతో, ఆ వెంటనే లెబనాన్ కూడా ఈ యుద్ధంలో భాగమైంది. దీనికి ప్రతీకారంగా లెబనాన్ అంతటా బాంబుల వర్షం కురిపించిన ఇజ్రాయెల్, ఆ దేశ దక్షిణ ప్రాంతంలోని సుమారు 5 శాతం భూభాగాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. తమ ఉత్తర సరిహద్దుల నుంచి హిజ్బొల్లా ఫైటర్లను వెనక్కి పంపడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు, ఆ ప్రాంతం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఢిల్లీకి వస్తున్నా..

కూడా వెంట తీసుకువస్తానని తెలిపారు. సమావేశ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుని ఆ వివరాలను వీలైనంత త్వరగా తెలియజేయాలని లేఖలో కిషన్‌రెడ్డిని కోరారు. ఇప్పటికే కిషన్ రెడ్డి లక్ష్యంగా రేవంత్ చేస్తున్న వరుస వ్యాఖ్యల పైన రాజకీయంగా చర్చ సాగుతోంది. కిషన్ రెడ్డి సైతం తన పైన చేసిన విమర్శల కు కౌంటర్ ఇచ్చారు. కేంద్రం ఎలాంటి నిధులను అడ్డుకోలేదని.. తెలంగాణ విషయంలో తన చిత్తశుద్ధి పైన అపోహలు అవసరం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రేవంత్ రాసిన లేఖ విషయం లో కిషన్ రెడ్డి ఏ విధంగా స్పందిస్తారు.. రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది కీలకంగా మారుతోంది.

## తెలంగాణ నుంచి రాజ్యసభకు మీనాక్షి..?

బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ప్రస్తుతం ఎలాంటి లీగల్ కేసులు లేవని, చట్టబద్ధంగా తాను అన్ని నిబంధనలను పాటించానని స్పష్టం చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఒక పాత కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికార బీజేపీ, ఈసీ లాలూచీపడి, కుట్రపూరితంగా తన నామినేషన్‌ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తన రాజ్యసభ సీటు తీవ్రమైన కుట్రతో చోరీకి గురైందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువులకు విరుద్ధంగా చేస్తున్న కుట్రలను, అక్రమాలను సమాజానికి విడమరిచి చెప్పడానికే తాము ఈ లీగల్ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లు తనకోసం మరొకరితో బలవంతంగా రాజీనామా చేయించి, తెలంగాణ కోటాలో తాను రాజ్యసభ సీటును తీసుకోలేనని చెప్పారు. తాను పుట్టి పెరిగింది, రాజకీయాలు చేసింది మధ్యప్రదేశ్‌లోనే కాబట్టి ఆ రాష్ట్ర ప్రజల తరపునే తాను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత శత్రువులే మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను ప్రత్యర్థి పార్టీకి అందించారంటూ వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలే ప్రత్యర్థులకు ఇచ్చారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. బీజేపీ తన ఓటమి భయంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపిందని విమర్శించారు. అఫిడవిట్‌లో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన నామినేషన్ తిరస్కరించాల్సిన అవసరం లేదని.. దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. స్క్రూటినీ జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను నామినేషన్ రూమ్‌లోకి అధికారులు ఎందుకు అనుమతించారని ఆమె ఈసీని నిలదీశారు. కాగా, మీనాక్షి నటరాజన్ గతంలో రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలక నేతగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా కూడా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. ఈ నామినేషన్ తిరస్కరణ అంశం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ తిరస్కరణను కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తుండగా.. నిబంధనల ప్రకారమే ఈసీ నిర్ణయం తీసుకుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ లీగల్ టీమ్ ఇప్పటికే కసరత్తు చేస్తోంది.

## నీట్ రీఎగ్జామ్ విద్యార్థుల కోసం

మే 3న నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రాల లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేయబడగా, ఆదివారం మళ్లీ పరీక్ష నిర్వహిస్తున్నారు. రీఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు జరుగుతోంది. భారత్‌లోని 551 నగరాల్లో 5,440 కేంద్రాలు, విదేశాల్లో 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యర్థులు పాల్గొనే పరీక్ష కావడంతో, పరీక్షా కేంద్రాల వద్ద సమయపాలన, రాకపోకలు అత్యంత కీలకంగా మారాయి. మోదీ ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో రెండు రోజుల పర్యటన పూర్తి చేసుకుని ఢిల్లీకి తిరిగి వచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. పరీక్షల సమయంలో భద్రతా ఏర్పాట్లు, ప్రజా రవాణా మధ్య సమతుల్యత ఎంత అవసరమో ఈ పరిణామం మరోసారి గుర్తు చేసింది.

## అమెరికాఇరాన్ చర్చలు


అంతర్జాతీయ వాణిజ్యం సురక్షితంగా సాగుతుంది. ఆఫ్రికా చుట్టూ తిరిగి వచ్చే ఖరీదైన, ప్రమాదకరమైన మార్గాలను షిప్పింగ్ కంపెనీలు నివారించవచ్చు. దీనివల్ల భారత ఓడరేవులకు చేరుకునే దిగుమతి వస్తువుల ధరలు తగ్గుతాయి. స్విట్జర్లాండ్ సమ్మిట్.. భారత రూపాయి ప్రస్తుతం భారత విమానయాన సంస్థలు కొన్ని గగనతలాలను నివారించడం వల్ల అంతర్జాతీయ విమాన ప్రయాణాలు భారంగా మారాయి. ఇరాన్ గగనతలం మళ్ళీ అందుబాటులోకి వస్తే యూరప్, ఉత్తర అమెరికా దేశాలకు నేరుగా వెళ్ళవచ్చు. దీనివల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. విమాన ఇంధన ధరలు తగ్గితే ప్రయాణికులకు టికెట్ రేట్లు కూడా దిగివచ్చే అవకాశం ఉంది. స్విట్జర్లాండ్ చర్చలు సఫలమైతే ఈ ప్రాంతంలో కొత్త ఆర్థిక శకం మొదలవుతుంది. గల్ఫ్ దేశాల్లో ఉంటున్న భారతీయుల నుంచి వచ్చే రెమిటెన్స్ (విదేశీ నగదు) కూడా పెరుగుతుంది. ప్రపంచం సుస్థిరంగా ఉంటే భారత్‌కు అన్ని విధాలా లాభమే. ఇది ప్రపంచ ప్రగతికి ఒక గొప్ప ఆశాకిరణం.

## మెరుగైన సేవలు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి



**జయభేరి, కరీంనగర్ జిల్లా :**

హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌ను ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు అడిగి తెలుసుకున్నాను. బస్సుల సమయపాలన, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, ప్రయాణికులకు అందుతున్న సేవలపై ఆరా తీయడం జరిగింది. బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాను. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల నిర్వహణ, సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించడం జరిగింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం మాత్రమే కాకుండా, మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దే దిశగా కూడా మా ప్రభుత్వం కృషి చేస్తోంది. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది అని మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి ముందుకు సాగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. మహిళా సాధికారతకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సంపూర్ణ జ్ఞాన విశ్వం

**"అణువు నుండి అనంతం వరకు వ్యక్తి నుండి విశ్వం వరకు జ్ఞానం నుండి చైతన్యం వరకు"**

**దృష్టి :** ప్రపంచంలోని అన్ని ప్రధాన జ్ఞాన శాఖలను ఒకే సమగ్ర వ్యవస్థలో సమన్వయం చేసి, ప్రతి మనిషి తన సంపూర్ణ సామర్థ్యాన్ని తెలుసుకొని ఆరోగ్యంగా, సంపన్నంగా, ఆనందంగా, చైతన్యవంతంగా జీవించడానికి మార్గదర్శకత్వం అందించడం.

**మిషన్ :** ప్రాచీన వేద జ్ఞానం మరియు ఆధునిక శాస్త్రాన్ని అనుసంధానం చేయడం. జీవితంలోని ప్రతి రంగానికి ఉపయోగపడే విజ్ఞానాన్ని అందించడం. వ్యక్తి, కుటుంబం, సమాజం, మానవత్వాన్ని అభివృద్ధి చేయడం. చైతన్యవంతమైన ప్రపంచాన్ని నిర్మించడం.

**12 మహా విజ్ఞాన విశ్వాలు**

1. **ఆరోగ్య విశ్వం :** శరీరం, పోషకాహారం, జీవశక్తి, దీర్ఘాయుష్షు, యోగా, సహజ ఆరోగ్యం.
2. **మానసిక విశ్వం :** ఆలోచన, భావోద్వేగాలు, అలవాట్లు, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం.
3. **సంపద విశ్వం :** ధనసృష్టి, వ్యాపారం, పెట్టుబడులు, ఆర్థిక స్వాతంత్ర్యం, నాయకత్వం.
4. **సంబంధాల విశ్వం :** కుటుంబం, వివాహం, పిల్లల పెంపకం, సామాజిక జీవనం, కమ్యూనికేషన్
5. **విద్యా విశ్వం :** జీవిత విద్య, నైపుణ్యాలు, భవిష్యత్ విద్య, స్వయం ఉపాధి.
6. **వాస్తు విశ్వం :** పంచభూతాలు, వాస్తు పురుష మండలం, పవిత్ర జ్యామితి, గోల్డెన్ రేషియో.
7. **జ్యోతిష విశ్వం :** నవగ్రహాలు, 27 నక్షత్రాలు, 12 రాశులు, కర్మ విశ్లేషణ.
8. **యోగ & ధ్యాన విశ్వం :** ధ్యానం, యోగం, కుండలిని, చక్రాలు, చైతన్య వికాసం.
9. **వేద విశ్వం :** ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం, ఉపనిషత్తులు.
10. **సనాతన విశ్వం :** రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత, పురాణాలు.
11. **కాస్మిక్ విశ్వం :** విశ్వ నిర్మాణం, కాల చక్రాలు, గెలాక్సీలు, డివైన్ కోడ్.
12. **భవిష్యత్ మానవ విశ్వం :** Human 2.0, AI & Consciousness, Global Civilization, Universal Humanity.

**24 ఇంటెలిజెన్స్ ఫ్రేమ్‌వర్క్స్**


1. Health Intelligence, 2. Wealth Intelligence, 3. Relationship Intelligence, 4. Leadership Intelligence, 5. Emotional Intelligence, 6. Spiritual Intelligence, 7. Communication Intelligence, 8. Family Intelligence, 9. Business Intelligence, 10. Financial Intelligence, 11. Educational Intelligence, 12. Creative Intelligence, 13. Social Intelligence, 14. Human Intelligence, 15. Vedic Intelligence, 16. Astro Intelligence, 17. Vastu Intelligence, 18. Cosmic Intelligence, 19. Earth Intelligence, 20. Time Intelligence, 21. Divine Intelligence, 22. Universal Intelligence, 23. Consciousness Intelligence, 24. Moksha Intelligence.

**శంభాల 360 యొక్క 7 మూల సూత్రాలు**

విశ్వ మేధస్సు, సృష్టి యొక్క దివ్య సంకేతం, విశ్వ క్రమం, స్వర్ణ నిష్పత్తి, పవిత్ర జ్యామితి, వేద జ్ఞానం, చైతన్య జీవనం.

**శంభాల 360 మహా గ్రంథమాల**

54 ప్రధాన గ్రంథాలు, 108 ఉప గ్రంథాలు, 1080+ అధ్యాయాలు, 5000+ పేజీలు, 1000+ చిత్రాలు, 108 జీవన నమూనాలు, 108 ధ్యాన విధానాలు, 24 ఇంటెలిజెన్స్ ఫ్రేమ్‌వర్క్స్.



**Dr. హరి హర నాద రాజు**
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

**శంభాల 360 జీవన స్తంభాలు**

**ఆరోగ్యం :** శరీరం, మనస్సు, శక్తి, చైతన్యం.
**సంపద :** ఆర్థిక స్వాతంత్ర్యం, సమృద్ధి, వ్యాపారం.
**సంబంధాలు :** కుటుంబం, ప్రేమ, సామరస్యం.
**చైతన్యం :** ధ్యానం, యోగం, మోక్షం.

**శంభాల 360 మహావాక్యం**

"జ్ఞానం నుండి అవగాహనకు అవగాహన నుండి చైతన్యానికి చైతన్యం నుండి సంపూర్ణ జీవితానికి."

అంతిమ సందేశం.. ఒక జీవితం, ఒక భూమి, ఒక మానవత్వం.. జ్ఞానం, అవగాహన, చైతన్యం, సంపూర్ణ జీవితం.

## నీట్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్

భద్రతా సిబ్బంది రెండు సార్లు కఠినమైన తనిఖీలు నిర్వహించినప్పటికీ, అతడి వద్ద ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు లేకపోవడంతో లోపలికి అనుమతించారు.

పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికి, ఆ విద్యార్థి తనకు తీవ్రమైన కడుపు నొప్పిగా ఉందంటూ ఇన్విజిలేటర్లను నమ్మించి వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అయితే, అతను వెళ్లిన చాలా సేపటి వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్లు లోపలికి వెళ్లి పరిశీలించారు. అక్కడ సదరు విద్యార్థి వెంటిలేటర్ నుండి మొబైల్ ఫోన్ తీసి, గూగుల్ క్రోమ్ ద్వారా నీట్ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. దీంతో వెంటనే అలర్ట్ అయిన పరీక్షా కేంద్రం సిబ్బంది ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, పోలీసులకు సమాచారం అందించారు. స్కూల్ యాజమాన్యం ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను తన నేరాన్ని అంగీకరించాడు. ఈ అక్రమ ఉదంతంపై పోలీసులు బీఎన్ఎస్ (BNS) సెక్షన్ 318(4)తో పాటు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భవిష్యత్తులో ఇలాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా, విద్యార్థుల జీవితాలు నాశనమవ్వడమే కాకుండా చట్టపరంగా కఠినమైన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా పోలీసులు గట్టిగా హెచ్చరించారు.

## అన్నదాత సుఖీభవ నిధులు

ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ అధికారులు భరోసా ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకు తప్పనిసరిగా వారి ఆధార్ కార్డు అనుసంధానమై ఉండాలని చెబుతున్నారు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ కాకపోతే, అలాంటి రైతులు వెంటనే తమ సంబంధిత బ్యాంకు శాఖకు వెళ్లి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఆధార్ లింక్ సక్రమంగా ఉంటే వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆ డబ్బులు ఆటోమేటిక్‌గా ఖాతాలో పడతాయని అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా రెవెన్యూ రికార్డుల్లో సమస్య ఉంటే.. పూర్తి ఆధారాలతో స్థానిక గ్రామ సచివాలయానికి వెళ్లాలని.. అక్కడ ఈ అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మ్యుటేషన్లు జరగకపోవడం, ఆన్‌లైన్ పేర్లు నమోదు కాకపోవడం, లేదా కుటుంబ సభ్యులు చనిపోయిన వారి పేరిటే రికార్డుల్లో ఇంకా భూములు ఉండటం లాంటి సమస్యలు ఉంటే వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సరిచేసుకోవటం ద్వారా.. నిధులు జమ అవుతాయని అధికారులు వెల్లడించారు.

## రేవంత్ రెడ్డి వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం

అని వేచి చూస్తున్నారని అన్నారు. ఒక చలనచిత్రం విఫలమైతే కేవలం కొద్దిమంది పెట్టుబడిదారులకే నష్టం వస్తుందని, కానీ ఒక ముఖ్యమంత్రి వైఫల్యం వల్ల కోట్లాది మంది తెలంగాణ ప్రజల భవిష్యత్తు అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగుతున్న భూ అక్రమాలను ప్రస్తావిస్తూ శంషాబాద్ ప్రాంతానికి చెందిన ఒక బాధితుడి ఉదాహరణను ఆయన పంచుకున్నారు. తన వివాహ పత్రికను అందించేందుకు వచ్చిన సదరు వ్యక్తి, తన పూర్వీకుల భూమిని అన్యాయంగా నిషేధిత జాబితాలో చేర్చారని కన్నీరు పెట్టుకున్నట్లు తెలిపారు. ఆ భూమిని విడిపించాలంటే అధికార పక్ష నేతలు ఎకరానికి కోటి రూపాయల లంచం డిమాండ్ చేస్తున్నారని సదరు రైతు వాపోయాడన్నారు. వచ్చే రెండేళ్లూ ఎలాగోలా తన భూమిని కాపాడుకుంటానని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చాక ఈ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ బాధితుడు కోరినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# భక్తజనంతో పోటెత్తిన యాదగిరిగుట్ట

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 21:



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం, టికెట్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్, బస్టాండ్, పుష్కరిణి, తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## కొనసాగుతున్న నిత్యపూజలు..

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## యాదగిరీశుడి నిత్యరాబడి..

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.56,59,882 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,67,600, బ్రేక్ దర్శనం ద్వారా రూ.5,33,100, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,88,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.10,75,650, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,26,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,20,664, ప్రసాద విక్రయం ద్వారా రూ.19,41,230, కల్యాణకట్ట ద్వారా రూ.1,75,000తోపాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



# వంగపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు

జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 21:

యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ఆదివారం ఆర్టీసీ బస్సును స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,స్థానికులు ప్రారంభించారు. వంగపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ప్రజా రవాణాను మరింత చేరువ చేసిన ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి గ్రామ సర్పంచ్ ఒగ్గు రవళి రాణాప్రతాప్, డీసీసీ జిల్లా జనరల్ సెక్రటరీ కానుగు బాలరాజు గౌడ్, మదర్ డెయిరీ డైరెక్టర్ కల్లెపల్లి శ్రీశైలం,వార్డు సభ్యులు కానుగు రాజీవ్ గౌడ్, కల్లే వినోద్ కుమార్, చిన్నం మల్లేష్, గడ్డం ప్రకాష్, నాయకులు జోగు శంకర్, రేగు సిద్ధి రాములు, ఐలయ్య, ఓగ్గు ఉపేందర్, ఉప్పలయ్య, నరసింహా, నమిలే రవి, గడ్డం బాలయ్య, పురుషోత్తం, మస్తాన్, హరి శంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. వంగపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# పద్మ శాలి ఉద్యోగుల సదస్సును విజయ వంతం చేయాలి

- పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ నేత




జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 21:

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సదస్సు విజయవంతం చేయాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ నేత వెల్లడించారు. ఆదివారం యాదగిరిగుట్టలో TPUS రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 26న హైదరాబాద్ ఎల్బీనగర్ లోని స్వాకుల సాలి సమాజ భవనంలో నిర్వహిస్తున్నట్లు,పద్మశాలి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రచ్చ గణేష్ ప్రసాద్ నేత, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంజి నాగేశ్వర్ రావు నేత, కార్యవర్గ సభ్యులు మీనా సురేందర్ నేత, రాపోలు సోమేశ్వర్ నేత, స్వర్గం జనార్దన్ నేత, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే భూమి - ఒకే ఆరోగ్యం కోసం యోగా

- అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :



డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ పార్క్1లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, యువత, మహిళలు, వృద్ధులు పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక, ఆరోగ్య సంపద అని అన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవనశైలి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత వేగవంతమైన జీవన విధానంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ప్రజలందరూ ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న వారితో కలిసి యోగా ఆసనాలు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు నాగు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జయభేరి, హయత్ నగర్ :

కొయ్యల ప్రత్యూష(20), తండ్రి బాలయ్య, (నివాసం సాయినగర్ కాలని, పెద్ద అంబర్పేట) వనస్థలిపురంలోని UNISEX సెలూన్ నందు బ్యూటిషన్ గా పనిచేయుచున్నది. తేదీ 20.06.2026 నాడు తన పని ముగించుకొని రాత్రి 08:45 గంటల సమయంలో తిరిగి ఇంటికి తన స్కూటీ AP29BN7372 వచ్చుచుండగా హయత్ నగర్ తొర్రూర్ రోడ్ నందు గల సాయిబాబా గుడి ఎదురుగా వినాయక నగర్ కాలనీ వద్దకు రాగానే ఒక ఆర్టీసీ బస్సు నెంబర్ TS09Z7894 గల డ్రైవరు వెనుక నుండి తక్కరివ్వగా ప్రత్యూష స్కూటీపై నుండి రోడ్డుపై పడిపోగానే బస్సు తన ఛాతి పైనుండి వెళ్ళినది. ఈ ప్రమాదంలో తన ఎడమ చేయి, తలకు బలమైన రక్త గాయాలు కాగా చుట్టుపక్కల వారు గమనించి వెంటనే సన్రైజ్ హాస్పిటల్, హయత్ నగర్ కి తరలించగా.. అక్కడ డ్యూటీ డాక్టర్ ప్రత్యూషని పరీక్షించి అప్పటికే చనిపోయినది అని నిర్ధారించినారు. ప్రమాదానికి కారణం అయిన RTC బస్ డ్రైవరు పేరు జనికల వెంకటేశ్వర్లు, తండ్రి బుచ్చయ్య అని తెలిసినది. కావున ప్రమాదానికి కారణం అయిన RTC డ్రైవరు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలసినదిగా ప్రత్యూష తండ్రి బాలయ్య పిర్యాదు చేయనైనది. మృతురాలు ప్రత్యూష తన తల్లిదండ్రులతో పాటుగా కలిసి ఉంటుంది తన తల్లిదండ్రులు ఇద్దరు కూడా గ్రేస్ చిల్డ్రన్ స్కూల్ నందు హాస్టల్లో వంట పని చేయుచున్నారు.

# 'తండ్రి' జీవితానికి తొలి గురువు

- హైకోర్టు న్యాయవాది సరోజ్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

తండ్రి అంటే కేవలం ఒక వ్యక్తి కాదు, జీవితానికి తొలి గురువు అని హైకోర్టు న్యాయవాది, దేవరకద్ర నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి అన్నారు. అలాగే తండ్రి అంటే అండగా నిలిచే ధైర్యం, ప్రేమకు ప్రతిరూపం అని ఆయన అన్నారు. కుటుంబం కోసం నిరంతరం శ్రమిస్తూ మన భవిష్యత్తుకు బలమైన పునాది వేసే ప్రతి తండ్రికి ఈ సందర్భంగా సరోజ్ రెడ్డి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

జయభేరి, యాదగిరిగుట్ట:



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నక్క మహేష్‌మధుశ్రీ దంపతులకు పట్టుబట్టలు, యాట పొట్టేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. పేద కుటుంబాలు అద్దె ఇళ్లలో,తాత్కాలిక గృహాల్లో ఇబ్బందులు పడకుండా శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అమలులో విశేష పురోగతి సాధించామని, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆలేరు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు గృహ నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి కుటుంబం సొంత ఇంటిలో ఆనందంగా జీవించే రోజులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు దుస్తుల పంపిణీ

జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :



తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామానికి చెందిన 25 మంది ఆటో కార్మికులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్త రాములు, ఉపసర్పంచ్ గుమ్మడి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జింకల ఎల్లేష్ యాదవ్, చాప కిష్టయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు గజం వంశీ కుమార్, బర్ల అశోక్, ఆంజనేయులు ,సాగర్, ఎల్లేష్ పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతానికి గేదె మృతి


రూ.1.30 లక్షల నష్టం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో ఆదివారం విద్యుత్ ఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. స్థానికుడైన రైతు ఆది హనుమంత్ రెడ్డికి చెందిన ముర్రా జాతికి చెందిన గేదె మేత మేయడానికి వెళ్లి గూరకొండ శివారులోని విద్యుత్ స్థంభం వద్ద విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. విద్యుత్ వైర్లు చాలా కిందికి ఉండడంతో ఈ ప్రమాదం జరగడానికి ఆస్కారం ఏర్పడింది. మృతిచెందిన గేదె విలువ దాదాపు 1లక్ష 30 వేల వరకు ఉంటుందని రైతు ఆది హనుమంత్ రెడ్డి విలేకరులకు తెలిపారు.

# పుట్టు చీర మహోత్సవానికి హాజరైన సరోజ్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం తిరుమలపూర్ లో ఆదివారం బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు, వార్డు సభ్యుడు వడ్డే మహేందర్ కూతుర్ల పుట్టు చీర కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులను ఆయన ఆశీర్వదించారు.

# మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది

■ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 21 :**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మహిళల సాధికారత మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తుర్కపల్లి మండలం బిలియా నాయక్ తండాలో మహిళా సంఘ భవన నిర్మాణానికి మాదాపూర్ గ్రామంలో మహిళా సంఘ భవనానికి రుస్తాపురం గ్రామంలో మహిళా సంఘం భవనానికి రాంపూర్ గ్రామంలో మహిళా సంఘ భవనానికి తిరుమలాపూర్ గ్రామంలో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు అనంతరం ములకలపల్లి గ్రామంలో ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడే విధంగా మహిళా సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు మహిళల ఆర్థిక సామాజిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకమని వారి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక



సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు ఇందిరమ్మ ఇండ్ల దేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పట్టుబట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ యాట పొట్టేలును అందజేసి ఆశీర్వదించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకొని అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు పేదలకు సొంత ఇంటి కలను సహకారం చేయాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మహిళా సాధికారత మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత నిస్తుందని అన్నారు మహిళా సంఘాల భవనాలు నిర్మాణం పూర్తయిన తర్వాత సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగుతాయని గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా శక్తి భవనాలను 90 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తుందని మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ డిసిసి వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ నాయక్ ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## కూచారం గ్రామ అభివృద్ధికి ఎంపీ నిధులు కోరిన సర్పంచ్ చిత్ర రఘు

**జయభేరి, మేడ్చల్, జూన్ 21 :**

కూచారం గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ రాజనాల చిత్ర రఘు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం తదితర అభివృద్ధి పనుల కోసం ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గ్రామ అభివృద్ధి అవసరాలను పరిశీలించి, సాధ్యమైన మేరకు ఎంపీ నిధుల ద్వారా సహకారం అందిస్తామని సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు కిరణ్ కుమార్ యాదవ్, మండల సీనియర్ నాయకుడు శ్రీకాంత్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు శ్రీహరి గౌడ్, వంగల రాము గౌడ్, తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ఎంపీ నిధుల మంజూరు కోసం చేసిన ఈ విజ్ఞప్తి ఫలిస్తే కూచారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఊతం లభిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వూర నిర్మల అంతిమయాత్ర

■ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**జయభేరి, పరకాల, జూన్ 21:**

పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీ వూర రవీందర్ రావు సతీమణి శ్రీమతి వూర నిర్మల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలుసుకున్న పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నిర్మల పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆమె మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, నిర్మల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ




సానుభూతిని తెలియజేస్తూ, దివంగత నిర్మల ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోనెల శరత్ బాబు తల్లి శ్రీమతి గోనెల కనకలక్ష్మి కొద్ది రోజుల క్రితం మృతిచెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగాతో మంచి ఆరోగ్యం

■ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా ఆసనాలు అభ్యసించిన హంస కృష్ణా గౌడ్



**జయభేరి, మేడ్చల్ :**

యోగాతో మంచి ఆరోగ్యాన్ని సాధించవచ్చు అని గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ సముద్రాల హంసా కృష్ణాగౌడ్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు యోగా ఆసనాలను అభ్యసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది భారతీయ సనాతన సంస్కృతికి ప్రతీక అని, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసి భారత ఔన్నత్యాన్ని చాటారని అన్నారు. యోగ సాధన శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా దివ్య ఔషధంలా పనిచేసి ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన జీవితాన్ని అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకుని ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని హంస కృష్ణా గౌడ్ పిలుపునిచ్చారు.



## ప్రతిరోజు యోగాకు కొంత సమయాన్ని కేటాయించాలి

■ బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

ప్రతి వ్యక్తి నిత్యజీవితంలో ప్రతిరోజు కొంత సమయాన్ని యోగాకి కేటాయించాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి సూచించారు. యోగా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజు గంటపాటు యోగా చేస్తే మనసు ఉల్లాసంగా మరియు ఉత్సాహంగా ఉంటుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రోజు ఒక గంట సేపు యోగ చేయాలని ప్రశాంత్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు అంతర్జాతీయ యోగా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

## శారీరక మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుంది

■ పెద్దముప్పారం హై స్కూల్ లో ఘనంగా యోగ అంతర్జాతీయ దినోత్సవం:

■ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి

**జయభేరి, దంతాలపల్లి, జూన్21 :**

మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దముప్పారంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే యోగ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్. ఎమ్. శ్రీదేవి మాట్లాడుతూ 2015 జూన్ 21 నుండి మొదటి సారి అంతర్జాతీయం గా నిర్వహించడం ప్రారంభమైనదని, జూన్ 21న అత్యధిక పగటి సమయం ఉండటం వల్ల ఈ రోజు ను అంతర్జాతీయ యోగ దినోత్సవం గా నిర్ణయించడం జరిగిందని అన్నారు. ఈ రోజే కాకుండా ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగ చేయడం




వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా జీవిస్తారని, తద్వారా ఆరోగ్య కరమైన సమాజం తయారవుతుందని , పిల్లలు రోజు విధిగా యోగ చేయడం వల్ల ఆరోగ్యం తో పాటు జ్ఞాపక శక్తి కూడా అభివృద్ధి చెంది చదువులో బాగా రాణిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ఉపాధ్యాయులు శంకరయ్య, లింగయ్య, ఆయుర్వేద వైద్యాధికారి డా.విజయందర్, ఫార్మాసిస్ట్ రమేష్, ఆయుష్ యోగ శిక్షకులు అనిల్, హాస్టల్ వార్డెన్ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**మేడ్చల్ :**

చెట్ల కటింగ్, ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా జూన్ 22, 2026 (సోమవారం) నాడు 11 కేవీ కేఎల్ఆర్ ఫీడర్ (కిష్టాపూర్ సబ్ స్టేషన్ పరిధి) నుంచి విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారి రాంబాబు ఏఈ తెలిపారు. ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనుంది. ఈ కారణంగా కేఎల్ఆర్ ఫేజ్ 1, ఫేజ్2, ఫేజ్3 మరియు కేఎల్ఆర్ ప్రాంతాలు ప్రభావితమవుతాయి. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ రాంబాబు కోరారు.

## మానసిక ఒత్తిడి తగ్గాలంటే యోగ



**జయభేరి, కూకట్పల్లి :**

అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని ఆర్ట్ బార్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున కూకట్పల్లిలోని పటేల్ కుంట (హెచ్ ఎండిఎ) పార్కు నందు యోగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, వివేకానంద కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కూకట్పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముకులు మాట్లాడుతూ.. ఈ యాంత్రిక యోగంలో మానసిక ఒత్తిడి తగ్గాలంటే పిల్లలు, పెద్దలు, వృద్దులు ప్రతి ఒక్కరూ రోజూ యోగ చేయడం ఎంతో అవసరం అని అన్నారు. మన పూర్వికులు అప్పటి నుండే ఆరోగ్యమే మహాభాగ్యం, దేహమే దేవాలయం అని, ప్రకృతికి అనుగుణంగా ఆహార నియమాలు పాటిసస్తే ఆరోగ్యాకర జీవితం ఉంటుందని తెలియజేశారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ రాజశేఖర్, రాజి రెడ్డి, శేఖర్ యాదవ్, ఆర్ట్ బార్ యోగ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్

■ షాద్ నగర్ పొలిటికల్ జేఏసీ నేత టీజీ శ్రీనివాస్

■ పొలిటికల్ జేఏసీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

**జయభేరి, షాద్ నగర్, జూన్ 21 :**

తెలంగాణ పొలిటికల్ జేఏసీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ ప్రేరణకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మేధావి ఆయన అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను శాస్త్రీయంగా, చారిత్రకంగా వివరించి ఉద్యమానికి బలమైన సిద్ధాంత పునాదులు వేసిన వ్యక్తి



జయశంకర్ అని పేర్కొన్నారు. తెలంగాణ యువతకు ఆయన జీవితం ఆదర్శమని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జునప్ప, రామారావు, రవీంద్రనాథ్, యూటీఎఫ్ కృష్ణయ్య, మందారం నరసింహులు, టెలిఫోన్ సత్యనారాయణ, క్రాంతి కుమార్, రవి వెంకట్రామిరెడ్డి, దిలీప్, వెంకటేష్ ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, ఆర్టీసీ రాములు, బన్నే శ్రీకృష్ణ, ఎం.వీరేష్ తదితరులు పాల్గొన్నారు..

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**జయభేరి, పరకాల, జూన్ 21:**

ఆదివారం పరకాల నియోజకవర్గం ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గ్ కటాక్షపూర్ గ్రామానికి చెందిన గోపరబోయిన సుదర్శన్ ముదిరాజ్ - లక్ష్మి దంపతుల కుమారుడు అఖిల్ ముదిరాజ్ శిరీష గార్ల వివాహ రిసెప్షన్ అలాగే పరకాల పట్టణానికి చెందిన ఇంగిలి రాధాబాయి - రాజేశ్వర్ రావు దంపతుల కుమారుడు, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ఇంగిలి వీరేష్‌రావు వర్ష గార్ల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, నూతన దంపతులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వధూవరులను ఆశీర్వదించి వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు బంద్




జయభేరి, దేవరకొండ :

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ABVP దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమవేశాం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు ABVP పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 27,000ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000ల స్కూళ్లను ఎత్తివేసి మూడు లేదా నాలుగు మండలాలకి కలిపి ఒకటే తెలంగాణ పబ్లిక్ స్కూల్ లేదా ఇంటిగ్రేటెడ్ పేరుతో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసి గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేయాలనే ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఖాళీగా ఉన్న MEO, DEO పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దయనీయ స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, NEP 2020 ని అమలు చేయాలని, ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్,యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం నగర సంయుక్త కార్యదర్శి గుండాల శివరామకృష్ణ, యలమల హేమ సుందర్ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ బబ్లు, భూషరాజు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం అంతర్జాతీయ పితృ దినోత్సవ వేడుకలు ఘనంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు అంతర్జాతీయ యోగా దినోత్సవం ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగ గురువులు ఓంకారం ,వెంకటేశ్వర్లు విద్యార్థులచే యోగాసనాలు వేయించి యోగా గురించి వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవ అంతర్జాతీయ పితృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యోగ వల్ల శారీరిక దృఢత్వం మానసిక ప్రశాంతత మరియు ఏకాగ్రత పెరుగుతాయని ఒత్తిడిని తగ్గించి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుందని, అలాగే శరీర వశ్యతను మెరుగుపరిచి కండరాల నొప్పులను నివారించడంలో అద్భుతంగా పనిచేస్తుందని, గుండెపోటు రాకుండా ఉంటుందని, జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఉదయాన్నే యోగా చేయాలని అన్నారు. అనంతరం అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పితృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. తల్లి నవ మాసాలు మోసి జన్మనిస్తే తండ్రి బిడ్డలు ప్రయోజకులు అయ్యేంతవరకు వారి ఆలనా పాలన చూస్తారని,తల్లి ప్రేమ ఎంత గొప్పదో, తండ్రి పాత్ర కూడా పిల్లల జీవితంలో అంతే ముఖ్యమని, కుటుంబ భద్రతకు, పిల్లల భవిష్యత్తుకు ఒక తండ్రి పడే కష్టాన్ని గుర్తుచేసుకుంటూ వారిని సత్కరించుకోవడానికి ఈ దినోత్సవం ఒక ప్రత్యేకమైన అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి M భాస్కర్, తాళ్ల సురేష్, కరాటే మాస్టర్ గోపి, పందిరి వెంకన్న, బత్తుల సురేష్ ,రాజేష్, మురళి, రాఘవేందర్, వాసవి క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు PET రజిత, ట్రైబల్స్ స్కూల్ విద్యార్థులు PD మహేశ్వరి ,జ్ఞానేశ్వరి, క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండ లో ఇంటర్నేషనల్ యోగా దినోత్సవ వేడుకలు



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండ లో ఇంటర్నేషనల్ యోగా దినోత్సవం నిర్వహించామని ముఖ్య అతిథిగా శ్రీ మహేష్ యోగా ట్రైనర్ ని ఆహ్వానించటం జరిగింది అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో అధ్యాపక బృందం మరియు విద్యార్థినీలు యోగా కార్యక్రమం లో పాల్గొన్నారు.

## కరాటే నేర్చుకునే చిన్నారులు యోగాతో మనసును కూడా సిద్ధం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో. జె.కె.ఎ షోటోఖాన్ స్పోర్ట్ కరాటే అకాడమీ విద్యార్థులు. యోగా డే సందర్భంగా కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 30 నిమిషాల పాటు ప్రత్యేక యోగా, ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. మాకు ఈరోజు ఒక్కరోజే కాదు మా మాస్టర్ శ్రీనివాస్ సార్ ప్రతిరోజూ కరాటే క్లాస్ అయిపోగానే 15 నిమిషాల పాటు యోగా క్లాస్ తీసుకుంటారు. అందుకే మేము రోజూ యోగా నేర్చుకుంటున్నాం. శరీర దృఢత్వం కోసం కరాటే, మానసిక ఏకాగ్రత కోసం యోగా. ఈ రెండింటినీ మేళవించి చిన్నారులకు సమగ్ర శిక్షణ ఇస్తున్నారు కోచ్ శ్రీనివాస్. యోగా ఒక్కరోజు హడావిడి కాదని, నిత్యజీవితంలో భాగం కావాలనేది వీరి నినాదం. దీనికి ఈ చిన్నారులే నిదర్శనం.అని అన్నారు. కరాటేతో పాటు యోగాను నిత్యం అభ్యసింపజేస్తున్న కోచ్ శ్రీనివాస్‌కు, చిన్నారులకు అభినందనలు. యోగా ఒకరోజు పండగ కాదు, ప్రతిరోజూ పాటించాల్సిన జీవనశైలి అని దేవరకొండ చిన్నారులు నిరూపించారు. ఈ కార్యక్రమం లో కరాటే నేర్చుకునే చిన్నారులు,తది తరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు

జయభేరి, హైదరాబాద్ :

రూ.800 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎమ్మార్వో కార్యాలయం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె క్రిశాంక్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ళలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇంటికి పునాది కూడా వేయలేదు.. గత కేసీఆర్ ప్రభుత్వం ఒక కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రేవంత్ రెడ్డి ఆయన ఎమ్మెల్యేలు ఎక్కడ భూమి కనబడితే అక్కడ కబ్జా చేస్తున్నారు. ఇవాళ ఏకంగా రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ రూ.5 కోట్లు తీసుకొని గప్ చుప్ ఉన్నాడు. ఏ ఛానల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చర్చకు వస్తారో రావాలి, రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమిలో 6000 ఇందిరమ్మ ఇల్లు కట్టే బదులు, కమిషన్ల కోసం షాపింగ్ మాల్ కట్టడానికి కబ్జా ఎలా జరిగిందో చర్చిద్దాం. 2023 19 ఆగస్టులో కబ్జాదారులపై అప్పటి ప్రభుత్వం పోలీసు కేసులు కూడా నమోదు చేసిందని అన్నారు.

## డాన్ టు డస్క్ సూర్యుడు ఉదయించినప్పటి నుండి అస్తమించే వరకు చేసే కార్యక్రమాలు



జయభేరి, దేవరకొండ :

వాసవి క్లబ్ , వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ సూర్యుడు ఉదయించినప్పటి నుండి అస్తమించే వరకు చేసే కార్యక్రమాలు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జూన్ 20, 21 తారీకులలో డాంటు డస్క్ నిర్వహిస్తున్నది ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్ రూపొందించిన సేవా కార్యక్రమాలలో భాగంగా దేవరకొండ వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మన దగ్గర ఉన్న గోశాలకు 30 రోజుల గోదాన ఇవ్వడం జరిగినది మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ డొనేషన్ ఇచ్చే వారి పోస్టర్ బస్టాండ్ ఆవరణంలో ఎమర్జెన్సీ నెంబర్లు డిండి రోడ్ లో టీ గార్డ్ ఏర్పాటు ఏర్పాటు చేయడం వృద్ధాశ్రమాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందించడం జరిగినది వివిధ పాఠశాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఘనంగా సన్మానించి నోట్ బుక్స్ మెమొంటో అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ క్లబ్ నెంబర్ ఎర్రమళ్ళ శ్రవణ్ కుమార్ విచ్చేసి డాన్ టూ డస్క్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు అదేవిధంగా బెస్ట్ ఆఫ్ హానర్ గా ఐపిసి మిట్టపల్లి విజయభాస్కర్ విచ్చేశారు వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి నరసింహ, REC గందె మహేష్ హోలియా ఐపీసీ మెంబర్ వురుకొండ శోభన్ బాబు ,డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ నీల సంజీవ్ కుమార్, డిస్ట్రిక్ట్ జాయింట్ ట్రెజరర్ ఆలంపల్లి పద్మ, జోన్ చైర్మన్ కొత్త సావిత్రి సుబ్బారావు, క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి వెంకన్న ,వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి ఆంజనేయులు, కార్యదర్శి బెలిజ రవీందర్, నాగమల్ల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు యూరియా ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం

- యూరియా కోసం రైతులు క్యూల్లో.. కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రలో ఉంది.
- యాప్ పేరుతో యూరియాపై ఆంక్షలు.. రైతులపై కాంగ్రెస్ దౌర్జన్యం
- రైతు భరోసా లేదు.. కరెంట్ లేదు.. ఇప్పుడు యూరియా కూడా లేదు
- కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేదు..కాంగ్రెస్ పాలనలో రైతుకు కష్టాలే..
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



జయభేరి, దేవరకొండ :

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను సక్రమంగా అమలు చేయడం లేదు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను కూడా సరిగా సరఫరా చేయడం లేదు. ఇప్పుడు యూరియా విషయంలో కూడా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.....రైతులకు రెండు బస్తాల యూరియానే ఇస్తామని, అదీ యాప్ ద్వా రా మాత్రమే అందిస్తామని కొత్త ఆంక్షలు విధించడంపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా సరఫరాలో రవాణా సమస్యలు తలెత్తినప్పుడు, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా సంబంధిత జీఎంలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవారని ఆయన గుర్తు చేశారు. ఆనాడు వ్యవసాయ శాఖ మంత్రి, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తగిన చర్యలు తీసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేవారు. బీఆర్ఎస్ పాలించిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఒక్క సీజన్‌లో కూడా యూరియా కోసం గానీ, ఇతర ఎరువుల కోసం గానీ రైతులు ఇబ్బంది పడలేదని పేర్కొన్నారు. ఎరువుల కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎప్పుడూ రాలేదు. రైతులకు సకాలంలో ఎరువులు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి 75 సార్లు వెళ్లారని చెబుతు న్నారని, అయితే రైతుల అవసరాల కోసం కేంద్రాన్ని ఎందుకు ఒప్పించ లేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ వంటి అంశాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి భూములు తెచ్చుకునే సామర్థ్యం ఉన్నప్పుడు, రైతులకు అవసరమైన యూరియాను ఎందుకు సాధించలేకపోతున్నారని నిలదీశారు.తెలంగాణ రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందిం చాలి. గతంలో అమలైన విధంగానే యూరియా సరఫరా వ్యవస్థను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి ఘన నివాళి



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తొలి మలిదశ తెలంగాణ ఉద్యమాలలో తెలంగాణ రాష్ట్ర సాధన ముఖ్య ద్యేయంగా సూచిస్తూ అన్ని రాజకీయ వేదికలతో సమన్వయం చేసి రాష్ట్ర సాధన కి కృషి చేసినటువంటి సిద్ధాంతి తెలంగాణ రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు నియామకాలు లతో తెలంగాణ సస్యశ్యామలంగా మారుతున్నది దోపిడీదారుల నుండి విముక్తి కలుగుతున్నది అని ఆలోచించి రాష్ట్ర సాధన ధ్యేయంగా పనిచేసినటువంటి నాయకుడు జయశంకర్ సార్ అని కొనియాడారు వారి ఆశయ సాధన కోసం యువత పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గరిడి విజయభాస్కర్, పున్న వెంకటేష్ నేత, ఎండి రంజాన్ బేగ్, అప్పం వీరయ్య, నట్వ సుధాకర్, మునగాల గణేష్, దోమకొండ హరి, జయప్రకాష్ నారాయణ, భూషరాజు నిరంజన్, గుండెబోయిన సురేష్, బొల్లెపల్లి శంకర్, కాటం వెంకటేష్ గౌడ్ చెరుకు నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## నూతన పట్టు వస్త్ర అలంకరణ

- చిన్నారులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్ లో ఆదివారం గుండ్లపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన గోరటి రమణ శ్రీను దంపతుల కుమార్తె హాసిని, కుమారుడు లక్కీల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు హాజరై మెమొంటోను అందజేసి చిన్నారులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. హాసిని, లక్కీలు ఉన్నత విద్యను అభ్యసించి, సంస్కారంతో, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి, తిమ్మాపురం సర్పంచి స్వాతి ముత్యం, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం నాయకులు గోరటి అంజి, పంబాల పర్వతాలు, మాల మహానాడు సోషల్ మీడియా కోఆర్డినేటర్ చేపూరి మురళి, బయ్య శ్రీను, బయ్య శేఖర్, తిరుపతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

## మునుకుంట్ల తిరుమల్ రెడ్డి మమత అమెరికా ప్రయాణం



జయభేరి, దేవరకొండ :

మండలం కొండ భీమనపల్లి గ్రామ అభివృద్ధి ప్రదాత, పేదల పెన్నిధి గ్రామ మాజీ సర్పంచ్ (MVR ఫౌండేషన్ అధ్యక్షుడు) మునుకుంట్ల వెంకట్ రెడ్డి విద్యావతి కుమారుడు (NRI) మునుకుంట్ల తిరుమల్ రెడ్డి మమత అమెరికా కి వెళుతున్న సందర్భంగా హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మాజీ సర్పంచ్ మట్టిపల్లి వెంకటయ్య, గుండాల వెంకట్ యాదవ్, ఎర్ర కృష్ణ, పగిళ్ల చంద్రయ్య, కడారి మల్లేష్ యాదవ్, భీనమోని శివ యాదవ్, ఆంజనేయులు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనలో అన్నదాతలు



జయభేరి, హైదరాబాద్ :

శనివారం నాడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యూరియా యాప్ స్థంభించింది. ఎన్నిసార్లు ఓపెన్ చేసినా నాట్ ఫౌండ్, ఎర్రర్ అంటూ యూరియా బుకింగ్ యాప్ మొరాయించింది. యాప్ వైఫల్యంతో రైతులు గంటల తరబడి మొబైల్స్ ముందే పడిగాపులు కాసారు. యాప్ను వెంటనే రద్దు చేసి యూరియా అందించాలని డిమాండ్ చేసారు.



# కళ్లు ఆరోగ్యంగా ఉండి కంటి చూపు మెరుగుపడాలంటే..

పూర్వం మనుషులకు వయస్సు మీద పడితేనే కంటి చూపు కాస్త మందగించేది. వృద్ధాప్యంలోనూ చాలా మందికి కంటి చూపు స్పష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు అలా కాదు. చిన్న వయస్సులోనే చాలా మందికి కంటి చూపు మందగిస్తోంది. చిన్నారులు సైతం కళ్లద్దాలను ఉపయోగిస్తున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే కంటి చూపు మందగించడానికి ప్రధానంగా మనం తీసుకునే ఆహారమే ముఖ్య కారణమని వైద్యులు అంటున్నారు. మనం తీసుకునే ఆహారాల వల్ల కంటి చూపు దెబ్బ తింటుందని వారు చెబుతున్నారు. అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను ప్రస్తుతం చాలా మంది తింటున్నారు. వేపుళ్లు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, మాంసం వంటి వాటిని అధికంగా తింటున్నారు. వీటిల్లో ఉండే అనారోగ్యకరమైన కొవ్వులు రక్తనాళాల్లో పేరుకుపోతాయి. ఇవి కళ్లకు రక్త సరఫరాను తగ్గిస్తాయి. దీని వల్ల కళ్లకు కావల్సిన పోషకాలు లభించవు. దీంతో కంటి చూపు మందగిస్తుంది. ఇలా మనం తీసుకునే ఆహారాలు కంటి చూపు లోపించేందుకు కారణమవుతున్నాయి.

### ఈ ఆహారాలు మానేయాలి..

వైట్ బ్రెడ్, పాస్తా, చక్కెర పానీయాలు, బేకరీ ఆహారాలను తీసుకుంటే షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. దీర్ఘకాలంలో షుగర్ లెవల్స్ అధికంగా ఉంటే కళ్లలో ఉండే రెటీనాలోని చిన్నపాటి రక్తనాళాలు దెబ్బ తింటాయి. దీని వల్ల డయాబెటిక్ రెటినోపతి వస్తుంది. దీంతో క్రమంగా కంటి చూపు మందగిస్తుంది. ఈ ఆహారాలు కూడా కంటి చూపు దెబ్బ తినేందుకు కారణం అవుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది ఉప్పును కూడా అధికంగా తీసుకుంటున్నారు. దీని వల్ల బీపీ పెరిగితే కంటి రెటీనాపై ప్రభావం పడుతుంది. దీర్ఘకాలంలో ఇది కళ్లలో ద్రవాలు పేరుకుపోయేలా చేస్తుంది. దీని కారణంగా కళ్ల చుట్టూ వాపులకు గురవుతాయి. ఇది కూడా కంటి చూపుపై ప్రభావం చూపిస్తుంది. మద్యం అధికంగా సేవించే వారు తరచూ డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు. దీని వల్ల కళ్లు తరచూ పొడిబారుతుంటాయి. దీర్ఘకాలంలో ఇది కంటి చూపు మందగించేందుకు, కళ్లలో శుక్లాలు ఏర్పడేందుకు కారణం అవుతుంది. పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కంటి చూపు మందగిస్తుంది.

### వీటిని తీసుకోవాలి..

కంటి చూపు పెరిగేలా చేసేందుకు కూడా మనం ఆహారాలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇవి కంటి సమస్యలను తగ్గిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. పాలకూర, తోటకూర, పుదీనా, కొత్తిమీర వంటి ఆకుకూరలను ఆహారంలో భాగం చేసుకుంటే లుటీన్, జియాజాంతిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి.

ఇవి హానికర కిరణాల బారి నుంచి కళ్లను రక్షించడమే కాదు, కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. కళ్లలో శుక్లాలు రాకుండా చూస్తాయి. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. నారింజ, క్యారెట్లు, చిలగడ దుంపలు, గుమ్మడికాయలను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది. మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీని వల్ల కంటి చూపు పెరుగుతుంది. ముఖ్యంగా కళ్లలోని కార్నియా సురక్షితంగా ఉంటుంది. రేచీకటి తగ్గుతుంది.

### ఇవి కూడా మేలు చేస్తాయి..

చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కళ్ల రెటీనాను సంరక్షిస్తాయి. కళ్లు పొడిబారకుండా చూస్తాయి. కళ్లలో ఎప్పుడూ ద్రవాలు ఉండేలా చేస్తాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటాయి. ఇవి కళ్లలో ఉండే రక్త నాళాలను సంరక్షిస్తాయి. ఆయా రక్త నాళాలు వాపులకు గురికాకుండా చూస్తాయి. దీంతో కళ్లు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటాయి. బాదంపప్పు, వాల్ నట్స్, అవిసె గింజలలో విటమిన్ ఇ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. విటమిన్ ఇ వల్ల కళ్లలోని కణాలు సురక్షితంగా ఉంటాయి. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల ఆరోగ్యానికి కోడిగుడ్లు, పప్పు దినుసులు, శనగలు వంటి ఆహారాలను కూడా తినవచ్చు. వీటిల్లో ఉండే ప్రోటీన్లు కళ్లను రక్షిస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను రోజూ తీసుకుంటూ ఉంటే కళ్లకు జరిగే నష్టాన్ని నివారించవచ్చు. కంటి చూపు మెరుగు పడి కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..


కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదే విధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రొటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)





## మాయమైన అందాల భామ..


ఈ అందాల తార. కన్నడ భాషలో వరుసగా సినిమాలు చేస్తూ బిజీ హీరోయిన్‌గా ఉంది. తెలుగులోనూ ఆ మధ్య అవకాశాలు అందుకుంది. కానీ ఇప్పుడు ఈ అమ్మడు సైలెంట్ అయ్యింది. రిషబ్ శెట్టి హీరోగా నటించిన కాంతార సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది అందాల భామ సప్తమీ గౌడ. ఈ సినిమా పాన్ ఇండియా మూవీ విడుదలై అన్ని భాషల్లో విజయం సాధించింది. దాంతో ఆమె పేరు మారుమ్రోగింది. తెలుగులోనూ ఈ అమ్మడు మంచి ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. కన్నడ భాషలో సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ కాంతారా సినిమాతో ఫేమస్ అయ్యింది. ఈ సినిమాలో డీ గ్లామర్ రోల్ లో నటించి మెప్పించింది. అలాగే ఈ సినిమాలో తన అందంతోనూ కవ్వించింది. కాంతార సినిమా తర్వాత దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కించిన బాలీవుడ్ చిత్రం ది వ్యాక్సిన్ వార్ లో కూడా నటించింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. దాంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ పెరిగాయి. దాంతో తెలుగులోనూ నటించి మెప్పించింది. నితిన్ తమ్ముడు సినిమాతో తొలిసారి తెలుగులో కథానాయికగా నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా డిజాస్టర్ అయ్యింది. దాంతో ఈ బ్యూటీకి పెద్దగా తెలుగులో ఆఫర్స్ రావడం లేదు. ప్రస్తుతం కన్నడ ఇండస్ట్రీ పైనే ఎక్కువ ఫోకస్ చేసింది సప్తమి. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది సప్తమి గౌడ.



## చిరంజీవి సెట్స్‌లో రామ్ చరణ్ సర్‌ప్రైజ్ విజిట్!

మెగా అభిమానులకు ఫాదర్స్ డే సందర్భంగా ఓ ప్రత్యేక క్షణం ఆవిష్కృతమైంది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'మెగా 158' షూటింగ్ సెట్స్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సడెన్‌గా ప్రత్యక్షమై తన తండ్రికి సర్‌ప్రైజ్ ఇచ్చారు. తండ్రీకొడుకుల మధ్య చోటుచేసుకున్న ఈ ఆప్యాయ క్షణాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం దర్శకుడు బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో చిరంజీవి తన 158వ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సమయంలో ఫాదర్స్ డే సందర్భంగా రామ్ చరణ్ నేరుగా షూటింగ్ స్పాట్‌కు చేరుకుని తన తండ్రితో కొంత సమయం గడిపారు. చిరంజీవిని సర్‌ప్రైజ్ చేస్తూ సెట్స్‌లోకి వచ్చిన చరణ్‌ను చూసి చిత్ర యూనిట్ సభ్యులు కూడా ఆనందానికి గురయ్యారు. తండ్రీకొడుకులు కాసేపు ఆప్యాయంగా మాట్లాడుకుంటూ గడపడం అక్కడున్న వారందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రత్యేక క్షణాలను దర్శకుడు బాబీ కొల్లి సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. రామ్ చరణ్‌తో కలిసి దిగిన ఫొటోలను షేర్ చేస్తూ ఆయన ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. మెగా 158 సెట్స్‌లో అందమైన ఫాదర్స్ డే మూమెంట్‌ను చూడడం చాలా ఆనందంగా ఉంది. రామ్ చరణ్ సెట్స్‌కు వచ్చి తన తండ్రితో సమయం గడిపారు. ఎంత పెద్ద స్టార్ అయినా కుటుంబంపై ఉన్న ప్రేమ మాత్రం ఎప్పటికీ మారదు అని బాబీ పేర్కొన్నారు.సాధారణంగా చిరంజీవి, రామ్ చరణ్ కలిసి కనిపిస్తే వారి ఫొటోలు క్షణాల్లో వైరల్ అవుతాయి. అయితే ఈసారి దర్శకుడు బాబీ కేవలం రామ్ చరణ్‌తో ఉన్న ఫొటోలను మాత్రమే షేర్ చేయడం ఆసక్తిని పెంచుతోంది.దీంతో మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌ను చిత్రబృందం ఇప్పటివరకు గోప్యంగా ఉంచుతోందనే చర్చ మొదలైంది. ఇటీవల జరిగిన ఒక బర్త్‌డే సెలబ్రేషన్ ఫొటోల్లో కూడా చిరంజీవి కనిపించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. గతంలో చిరంజీవిబాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో మళ్లీ అదే కాంబినేషన్‌లో వస్తోన్న 'మెగా 158'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో చిరంజీవి మరోసారి తన స్టైల్, ఎనర్జీతో అభిమానులను అలరించనున్నట్లు సమాచారం. చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

## ఒక్కడు మళ్లీ వస్తున్నాడు



2003 సంక్రాంతి కానుకగా వచ్చిన మహేశ్‌బాబు 'ఒక్కడు' సినిమా ఎంతటి ఘనవిజయాన్ని సాధించిందో తెలిసిందే. గుణశేఖర్ దర్శకత్వంలో ఎంఎస్‌రాజు నిర్మించిన ఈ చిత్రం అప్పటివరకూ ఉన్న చాలా రికార్డులను అధిగమించి, ఆ ఏడాది నంబర్ వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో.. ఈ నెల 26న 'ఒక్కడు' కూడా 4k వెర్షన్‌లో థియేటర్లలో సందడి చేయనున్నది. రాధామాధవి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో రామకృష్ణ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ 'అన్ని జనరేషన్లకూ నచ్చే సినిమా 'ఒక్కడు'. ఇప్పటికే ఎన్నోసార్లు విడుదలైన ఈ సినిమా ఇప్పుడు 4k వెర్షన్‌లో రావడం ఆనందంగా ఉంది. అందరితోపాటు నేనూ ఈ సినిమా చూసేందుకు ఆసక్తిగా ఉన్నా' అన్నారు. భూమిక కథానాయికగా నటించిన ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, ముఖేష్‌రుషి కీలక పాత్రలు పోషించిన విషయం తెలిసిందే.

## ప్రియుడితో ఎంగేజ్మెంట్ చేసుకుని బ్రేకప్..





బుల్లితెర ప్రేక్షకుల ఫేవరెట్ టీవీ షో బిగ్‌బాస్ సందడి మళ్లీ ప్రారంభం కానుంది. ఇప్పటికే సక్సెస్ ఫుల్ గా తొమ్మిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో పదో సీజన్ కూడా త్వరలోనే షురూ కానుంది. ఇప్పటికే ఈ ల్యాండ్ మార్క్ సీజన్ కు సంబంధించి వరుసగా ప్రోమోలు, అప్డేట్స్ కూడా ఇస్తున్నారు. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులు కూడా కంటెస్టెంట్లుగా రానున్నారు. ఇందుకోసం అగ్ని పరీక్ష 2 దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు. త్వరలోనే అగ్ని పరీక్ష పోటీలు కూడా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం ఆగస్టు ఆఖరి వారం లేదా సెప్టెంబర్ మొదటి వారంలో బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ప్రారంభం కావొచ్చు. పదో సీజన్ కావడంతో ఈసారి హౌస్ లో చాలా సర్ ప్రైజెస్ ఉంటాయని తెలుస్తోంది. కంటెస్టెంట్ల ఎంపిక మొదలు గేమ్స్, టాస్కుల విషయంలోనూ చాలా కొత్త విధానాలను పరిచయం చేయనున్నట్లు టాక్. మరోవైపు పదో సీజన్ లో పాల్గొనే కంటెస్టెంట్ల పై ఊహాగానాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల పేర్లు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.

సోషల్ మీడియా సమాచారం ప్రకారం..బుల్లితెర నటి పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ భర్త పవన్ కళ్యాణ్, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, ఆట సందీప్ భార్య జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణీ, ప్రభాకర్ లేదా ఆయన కుమారుడు చంద్రహాస్ ఇలా చాలా మంది సెలబ్రిటీలు బిగ్ బాస్ హౌస్ లోకి వస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడీ జాబితాలో మరో పేరు బాగా వినిపిస్తోంది. ఆమెనే జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర. ఒకప్పుడు సెలూన్ పార్లర్‌లో పనిచేసిన ఆమె.. తన కష్టంతో ఈ స్థాయికి వచ్చింది. జబర్దస్త్ తో పాటు శ్రీదేవీ డ్రామా కంపెనీ వంటి పలు టీవీ షోల్లో పవిత్ర సందడి చేస్తోంది.

కాగా పవిత్ర బిగ్‌బాస్‌లో కంటెస్టెంట్‌గా రాబోతోందని గతంలో పలుసార్లు ఊహాగానాలు వినిపించాయి. అయితే ఈ సారి మాత్రం పవిత్ర కచ్చితంగా హౌస్ లోకి వస్తుందని గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే బిగ్ బాస్ టీమ్ ఆమెను సంప్రదించి చర్చలు జరుపుతున్నారని సమాచారం. ఒకవేళ పవిత్ర బిగ్‌బాస్‌లో అడుగుపెడితే ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఏ మాత్రం కొదవ ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో ఇదే జబర్దస్త్ రోహిణీ లాగే పవిత్ర కూడా బిగ్ బాస్ హౌస్‌కు మరింత కళ తీసుకువస్తుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## ఒకటి రూ.300కోట్ల బ్లాక్ బస్టర్..

చాలా మంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో స్టార్ డమ్ తెచ్చుకొని వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఇక ఇప్పుడు మమనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ కూడా అదే కోవలోకి వస్తుంది. ఈ అమ్మడు చేసింది 5 సినిమాలు అందులో ఒక్కటే పెద్ద హిట్.. ఎంత పెద్ద హిట్ అంటే ఏకంగా ఆ సినిమా రూ.300కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు మాత్రం ఆశించిన స్థాయిలో క్రేజ్ రాలేదు.. అలాగే అవకాశాలు కూడా రాలేదు. దాంతో ఇప్పుడు ఎక్కడా పెద్దగా కనిపించడం లేదు ఈ చిన్నది. టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ.. అమృత అయ్యర్. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. తేజ సజ్జ హీరోగా నటించిన హనుమాన్ సినిమాతో భారీ క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ మూవీ సూపర్ హిట్ కావడంతో ఈ అమ్మడుకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. హనుమాన్ సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మ పేరు గట్టిగానే వినిపించింది. కానీ అవకాశాలు మాత్రం పెద్దగా అనుదుకోలేకపోయింది. తెలుగులోనే కాకుండా అటు తమిళంలోనూ సినిమాలు చేసింది ఈ అమ్మడు. దళపతి విజయ్ నటించిన విజిల్ సినిమాలో చిన్న పాత్రలో కనిపించింది అమృత. ఈ సినిమాతో అమృతకు మంచి గుర్తింపు వచ్చింది. అంతకు ముందు సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన లింగ సినిమాలో సైడ్ యాక్టర్ గా కనిపించింది ఈ భామ. ఇక తెలుగులో రామ్ పోతినేని హీరోగా నటించిన రెడ్ సినిమాతో పరిచయం అయ్యింది. ఈ సినిమా తర్వాత క్రేజీ ఆఫర్స్ అందుకుంది. ఈ క్రమంలోనే హనుమాన్ సినిమాలో ఛాన్స్ వచ్చింది. హనుమాన్ సినిమా అంత భారీ హిట్ అయినప్పటికీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. చివరిగా ఈ భామ చేసిన బచ్చల మల్లి సినిమా నిరాశపరిచింది. దాంతో ఈ చిన్నదానికి అవకాశాలు మరింత తగ్గాయి. ఇప్పుడు ఈ బ్యూటీ అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**